# సాహిత్యమూ, రాజకీయాలూ

కొడవటిగంటి కుటుంబరావు.

" ఈ అభ్యుదయసాహిత్య మంతా బాగానే ఉందిగానండి, ఇందులోకి రాజకీయాలు తెస్తారేమో అని భయంగా ఉంది!" అన్నారొకరు.

అటువంటి దుష్కర్మ జరక్కుండా ఏమిటి ఉపాయ మని అడిగాం.

" ఈ ఉద్యమంలోంచి కమ్యూనిస్టుల్ని బహిష్కరిస్తే సరి!" అని సమాధానం వచ్చింది!

కనక రాజకీయాలను సాహిత్యాని కెడంగా ఉంచటం ఎవనివల్లా కాదు.

సాహిత్యానికి రాజకీయాల స్పర్శ ఉండరాదనే మూఢవిశ్వాసం మొదటినుంచీ ఉన్నదికాదు. వాల్మీకీ, వ్యాసుడూ వచ్చి రాజకీయాలు రాసేశారు; పై పెచ్చు, గెలుపొందిన పక్షాన చేరారు.

ఆది తెలుగుకవి అయిన నన్నయభట్టారకుడు, రాజరాజు చంద్రవంశంవాడుగనక భారతం రాశాడు; సూర్యవంశంవాడై ఉంటే మనకూ రామాయణమే తొలి గ్రంథమై ఉండును.

బమ్మెర పోతరాజుగారు తన భాగోతాన్ని రాజుల కంకితం ఇవ్వకుండా, వాళ్ళని మనుజేశ్వరాధములని తిట్టి, శ్రీరామచంద్రుడికి అంకితం ఇవ్వటం పెద్ద రాజకీయ ఉద్యమం. ఈ రోజుల్లో అయితే పోతరాజును జైల్లోపెట్టి మంచురాళ్ళమీద కూచోపెట్టి ఉండేవారు.

అసలారోజుల్లో కలిగిన చైతన్యంయావత్తూ సాహితీపరులు కల్పించినట్టే కనిపిస్తుంది. తిక్కనసోమయాజి సభాపర్వం ఎత్తుకుంటూనే రాజుల మనస్తత్వాలమీద విసిరిన విసుళ్ళకు మనుమసిద్ధి మొదలైనవాళ్లు కుళ్ళి చచ్చిఉండాలి — అప్పటికే చావకుండా ఉంటే ...... ఖడ్గతిక్కన తిక్కనసోమయాజులకు దగ్గిర ఒంధువేను.

*   *   *

రాజకీయాలంటే అసలే ప్రజలకోవిధమైన ఏవగింపు. ప్లీడరీచేసేవాడూ, రాజకీయాల్లోకి దిగినవాడూకూడా అన్నిరకాల దుష్టకార్యాలూ చెయ్యటం తప్పనిసరి అని నలుగురూ అనుకోటంకద్దు.

ఇటువంటి అభిప్రాయం ఉండేకామాలు 1921 లో కలిగిన రాజకీయ చైతన్యంతో ప్లీడర్లు తండోపతండాలుగా వచ్చి రాజకీయాల్లో చేరారు. ఈ విధంగా ప్లీడర్లు రాజకీయాల్లో ప్రవేశించటం మూలంగా ప్రజలకు రాజకీయాలను గురించి ఉండే దురభిప్రాయం మరింత బలపడింది.

రాజకీయకక్షల్లో కాంగ్రెసు జనసామాన్యాన్ని ఆకర్షించటానికి పెద్దకారణం ఏమంటే మహాత్ముడు రాజకీయవేత్తలకు

౯—౨

http://www.maganti.org/

ఉన్న తాదర్శ్యాలుండాలని ఆదేశించటమే. అయినప్పటికీ ఈనాడుకూడా ఏదుర్మార్గమైనా ప్రజలు సహించాలంటే అది రాజకీయంగానే చెయ్యాలి. అందుచేతనే వివేకంగలరౌడీలూ, గూండాలూ ఏరాజకీయపక్షంలో సందుదొరికితే ఆ రాజకీయ పక్షంలో దూరి తాము చెయ్యదలచిన ఘోరాలన్నీ యథేచ్ఛంగా చేసేసుకుంటున్నారు.

ఈ పరిస్థితుల్లో, సాహిత్యంలోకి రాజకీయాలు రావటం సాహిత్యాని కపకారమనే విశ్వాసం ప్రచారం చెయ్యటం మనరాజకీయాలకాట్టేమంచిదికాదేమో.

* * *

ప్రజలను సాహిత్యనుంచీ, సాహిత్యాన్ని రాజకీయాలనుంచీ, రాజకీయాలను ప్రజలనుంచీ కాపాడాలని రకరకాలవాళ్లు చేసే ప్రయత్నాలు చూస్తే ముచ్చటేస్తుంది. యథార్థ సాహిత్యంలో యథార్థజీవితంతాలూకు యథార్థ సమస్యలుండి ఆసాహిత్యంవల్లప్రజలు చెడిపోతారేమో నని కొందరికి బెంగ.

సాహిత్యప్రచారం మతప్రచారం మాదిరిగా పనిచేసి ప్రజలలో చైతన్యం కలిగిస్తుందనే భయం కొందరికి జాస్తి. ప్రభుత్వాలు ఇటువంటి భయం ప్రకటించటంలో అగ్రతాంబూలం పుచ్చుకున్నై. మాటవరసకి ముందడుగు నాటకప్రదర్శన నిషేధం తీసుకోండి. ఆ నాటకం చూసే ప్రజలు సంఘాని కపకారంగా పరిణమిస్తారని మద్రాసుప్రభుత్వం పాపం చాలా భయపడి సంఘక్షేమంకోసం ఆ నాటకాన్ని ప్రదర్శించకుండా నిషేధించింది సత్యహరిశ్చంద్రీయ నాటకంచూసిప్రజల నిజం నేర్చుకుంటారనే ఆశ ఏ ప్రభుత్వానికీ ఉన్నట్టు కనిపించదు. "నేను హరిశ్చంద్ర నాటకం ముప్ఫయ్యారుసార్లు చూశాను; కోర్టువారు నా మాట నమ్మాలి!" అని ఏ సాక్షిగాని అంటే కోర్టువారు నమ్మే ఆశలేదు. చింతామణి నాటకం చూసి భోగంవాళ్లు తమవృత్తి మానుకున్నట్టు ఒక్క నిదర్శనమూ లేదు అయినా ప్రభుత్వాలు అప్పుడప్పుడూ ప్రజాక్షేమంకోసం కొంత సాహిత్యాన్ని అణచిపెడుతూ ఉంటై. అదో వేడుక.

సాహిత్యాన్ని రాజకీయాలనుంచికాపాడే వారిని గురించి ఇంతకుముందే అనుకున్నాం.

పోతే, రాజకీయాలను ప్రజలనుంచి కాపాడే ఉద్యమం ఇప్పుడుమనం దేశంలో ప్రత్యక్షంగా చూస్తున్నాం.

భమిడిపాటి కామేశ్వరరావుగారు రాసిన ఒక నాటకంలో ఒక పాత్ర కొయ్యతుపాకీ పట్టుకొని, లాపాటివేపు మరో పాత్రకేసి బారుచేసిపెట్టి, "దీన్ని ఎలా కాల్చాలో నాకు చెబుతావా, నిన్ను చంపనా? అని బెదిరిస్తుంది. రెండో పాత్ర, "ఉండరా బాబూ కొంచెం జ్ఞాపకం తెచ్చుకోనీ!" అని వేడుకుంటుంది.





http://www.maganti.org/

ఇది చాలా ఛాందస హాస్యమని పెదిమ విరిచినవారున్నారు. కాని ఇటువంటి ఛాందసహాస్యానికి రాజకీయాలలో స్థానం ఉందని గుర్తించిన హిట్లరు, తనను బలవంతుడు కాకుండా అడ్డపడినట్టయితే బ్రిటనును హతమారుస్తానని ఛేంబర్లేనును హడలగొట్టి కోతిపుండంతవాడు బ్రహ్మరాక్షసి అయినాడు.

ఈనాడయినా మన రాజకీయవేత్తలు ఈ ఛాందసహాస్యంలో పరమార్థం గ్రహించినవారై ఎలెక్షను ఉపన్యాసాలలో, "మీరు మీ వోట్లు మాకే వెయ్యండి. లేకపోతే మేం ఎలెక్షన్లో గెల్చి — మేం గెలవకుండా బ్రహ్మదేముడాపలేడు !— మాకు వోట్లివ్వనివాళ్ళ భరతంపట్టిస్తాం," అని నిప్పులు కక్కుతున్నారు.

ఈ విధంగా రాజకీయాలను ప్రజలనుండి కాపాడే మహనీయుల రాజకీయాలు దిగ్విజయం పొందుగాక !

★

## ముద్దుకృష్ణ

వెలకు దొరకనీ విరుల సిరులతో
విరియ పూచినా విరులతోటనయి
సౌరభాలె నాసంపదగా ఇట
కాచుకుంటి నీకాలముదాకా !

ప్రేమకై పుతమ-
కమున గులాబీ
బుగ్గ మెరుపునకే
సిగ్గుపడునుగద !

నాయెద వికసించిన
కౌదమగులాబీ
యెదచేర్చక యెటు
కదలగలవురా !... వెలకు ...

ప్రియపువలపుల ·
వాలవెల్లి యీ
నార
మల్లికహృదయము
మధుధవళము సుమి !

నామానసమే సిత-
మల్లీవల్లిక
మన్నించక యెటు
మరలగలవురా ? ... వెలకు ...

మధుకరమంటని
మందారము హృది
కాశ్మీరారుణ
కమనీయమురా !

నాడెందమందమే
మందారశ్రీ
పొందక నీ విక
పోగలవటరా !... వెలకు.

Source: Press Academy Website, Prtibha Patrika, Muktyala Sanchika

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan